క్లుప్తంగా

ప్రభుత్వమే బాధ్యత వహించాలి


వైట్ల కిషోర్

పెనుగొండ: పవిత్రమైన తిరుమల క్షేత్రంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి భక్తులను పొట్టన పెట్టుకొన్న దారుణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు వైట్లకిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నైతిక బాధ్యత వహిసూస్తూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తక్షణం రాజీనామా చేయాలన్నారు. భక్తులు వైకుంఠ దర్శనం కోసం ప్రయత్నిస్తే వారిని ఏకంగా వైకుంఠానికి పంపిన ఘనత టీటీడీ పాలకమండలిదేనన్నారు. గతంలో 27 మందిని పొట్టన పెట్టుకొన్న చంద్రబాబు ప్రభుత్వం, ఇపుడు సైతం నిర్లక్ష్య ధోరణితోనే వ్యవహరించి ఇంతటి దారుణానికి కారణమైందన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి


వడలిలో రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

పెనుగొండ: వరి సాగులో రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం వడలిలో ఈ పంట నమోదను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులు అందరూ దమ్ములో 100 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 30 కేజీ యూరియా కలిపి వేయడం వల్ల గత పంట మోడులు కుళ్లి, దానితో పాటు భూమి సారవంతంగా తయారవుతుందన్నారు. అలాగే పొటాష్ ఎరువును మూడు దఫాలుగా వేయడం వల్ల పురుగులు, తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి స్పందన, వ్యవసాయ సహాయకుడు వై వర్మ తదితరులు పాల్గొన్నారు.

జూద క్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు

పెనుగొండ: సంక్రాంతి సందర్భంగా ఎటువంటి జూదక్రీడలకు, కోడి పందేలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పెనుగొండ ఎస్సై కె.గంగాధర్ హెచ్చరించారు. గురువారం పెనుగొండ తహసీల్దారు కార్యాలయంలో కోడి పందేల, జూద క్రీడల నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జూద క్రీడల వల్ల కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నం అవుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జి.అనితకుమారి, డీటీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యాల పుస్తకాల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులందరూ సంక్రాంతి సెలవుల్లో వేమన శతక పద్యాలు పఠించి నీతి వ్యాఖ్యలు నేర్చుకోవాలని ఎస్ఎంసీ చైర్మన్ కోటి విజయలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక పెదగరువు ప్రాథమిక పాఠశాలలో రామ్‌శ్లోక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంతెన గోపాలకృష్ణ, అనురాధ, రిషి శ్లోక్ కుటుంబ సభ్యులు విద్యార్థులకు వేమన శతక పద్యాల పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నిల్లా సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పంపన లక్ష్మీనారాయణ, పి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

నేడు దగ్గులూరులో గ్రామ సభ

పాలకొల్లు అర్బన్: రీ సర్వేకి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన దగ్గులూరులో శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 20 నుంచి దగ్గులూరులో రీ సర్వే నిర్వహిస్తామి పేర్కొన్నారు.

నేడు పోడూరులో సామాజిక తనిఖీ సభ

పోడూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పనులపై శుక్రవారం సామాజిక తనిఖీ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.మంగాకుమారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. పోడూరు మండలంలోని 16 గ్రామాల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు నిర్వహించిన ఉపాధి హామీ పనులను సామాజిక తనిఖీ చేస్తారని వివరించారు.

పీజీ రాజుకు డాక్టరేట్

పోడూరు: మదర్‌థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, హెబ్రోన్ ప్రేయర్ హౌస్ జున్నూరు, ఫౌండర్ అండ్ చైర్మన్ రెవరెండ్ బ్రదర్ పీజీ రాజు గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల పి.గన్నవరంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల గద్దర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నామని పీజీ రాజు గురువారం విలేకరులకు తెలిపారు. డాక్టరేట్ పొందిన పీజీ రాజును పలువురు ప్రముఖులు అభినందించారు.

ఇరుకు వంతెనలతో నరకయాతన

అవస్థలు తప్పడం లేదని వాపోతున్న ప్రజలు

పోడూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఇరుకు వంతెనలు, శిథిలావస్థకు చేరుకున్న వంతెనలతో ప్రజలకు, వాహనదారులకు అవస్థలు తప్పటం లేదు. మండలంలోని జగన్నాథపురంలో నరసాపురం ప్రధాన కాలువపై దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించిన కాలిబాట వంతెన గత ఏడెనిమిదేళ్ల నుంచి శిథిలావస్థకు చేరుకుంది. అంతేకాకుండా ఈ వంతెన ఇరుకుగా ఉండడంతో గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాలువకు అటువైపు ఉన్న ప్రజలకు ఈ వంతెన ఎంతో కీలకం. భవన నిర్మాణాల మరమ్మతులు వంటి సమయంలో ఇసుక, మెటల్, ఇనుము వంటి సామగ్రి తరలించడానికి గ్రామ ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలు పడుతున్నారు. వంతెన ఇరుకుగా ఉండడం వల్ల దాదాపు మూడు, నాలుగు కిలో మీటర్లు చుట్టు తిరిగి నిర్మాణ సామగ్రిని తరలించాల్సి వస్తోందని పలువురు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా ఇప్పటికైనా ఈ ప్రాంతంలో విశాలమైన వంతెన నిర్మించి ఇబ్బందులు పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బండారు వారి చెరువులో

పెనుమదం శివారు బండారు వారి చెరువు వద్ద చించినాడ పంటకాలువపై సుమారు 25 ఏళ్ల క్రితం చిన్న కాలిబాట వంతెన నిర్మించారు. బండారు వారి చెరువు గ్రామ ప్రజలు గుమ్మలూరు, ఆచంట వేమవరం, పోడూరు, పెనుమదం వైపు ప్రయాణించడానికి ఈ వంతెనే ప్రధాన మార్గం. ఈ వంతెనపై కేవలం ద్విచక్రవాహనాలు మాత్రమే వెళ్తాయి. ప్రస్తుతం ఉన్న ఇరుకు వంతెన కూడా శిథిలావస్థలో ఉంది. మరో వైపు పెనుమదం మీదుగా ఉన్న ఆచంట–పాలకొల్లు రాష్ట్ర రహదారి అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నాయి. ఈ రహదారికి ఆనుకుని ఉన్న ఈ ఇరుకు వంతెన స్థానంలో విశాలమైన పెద్ద వంతెనను నిర్మిస్తే తమ గ్రామానికి రవాణా వ్యవస్థ ఎంతో మెరుగవుతుందని స్థానిక ప్రజలు చెబుతున్నారు.

రాజులగరువులో

పెనుమదం శివారు రాజులగరువులో కాజ మేజర్ డ్రెయిన్‌పై నిర్మించిన ఇరుకైన కాలిబాట వంతెన కొంతకాలంగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ కాలిబాట వంతెన నిర్మించి సుమారు 25ఏళ్లు పైనే గడిచింది. శిథిలావస్థకు చేరుకున్న ఈ వంతెనకు సుమారు ఏడేళ్ల క్రితం తాత్కాలిక మరమ్మతులు చేశారు. పెనుమదం ప్రధాన గ్రామానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో రాజులగరువు గ్రామం ఉంటుంది. గ్రామానికి ఈ వంతెన మీదుగా ద్విచక్రవాహనాలు మాత్రమే వెళుతుంటాయి. వంతెన ఇరుకుగా ఉండడం వల్ల ఎవరైనా అనారోగ్యానికి గురైనప్పుడు లేదా గర్భిణీలను తరలించేందుకు అంబులెన్స్ లాంటి వాహనాలు ఇక్కడకు రావాలంటే పెనుమదం మీదుగా సుమారు 4 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుంది. మరోవైపు ఇసుక, కంకర, ఇనుము వంటి భవన నిర్మాణ సామగ్రి తరలించాలన్నా చుట్టు తిరిగి రావలసి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ ప్రాంతంలో విశాలమైన వంతెన నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


పెనుమదం శివారు బండారు వారి చెరువు వద్ద శిథిలావస్థకు చేరుకున్న కాలిబాట వంతెన

కాలిబాట వంతెనతో ఇబ్బందులు



జగన్నాథపురం గ్రామంలో ఇరుకుగా ఉన్న కాలిబాట వంతెనపైనే రాకపోకలు సాగిస్తూ చాలా కాలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువకు అవతల వైపు కూడా అనేక నివాసాలు ఉన్నాయి. దీంతో పాటు గ్రామ సచివాలయం, శివాలయం, రామాలయం ఉన్నాయి. కాబట్టి జగన్నాథపురం వద్ద నరసాపురం పంట కాలువపై విశాలమైన వంతెన నిర్మించాలి.

– దిద్దే శ్రీనివాస్, జగన్నాథపురం

కాజ డ్రెయిన్‌పై పెద్ద వంతెన నిర్మించాలి



రాజుల గరువు గ్రామంలో కాజ డ్రెయిన్‌పై ఉన్న ఇరుకు వంతెనతో స్థానిక ప్రజలు ఎంతో కాలంగా అవస్థలు పడుతున్నారు. పైగా ప్రధాన గ్రామానికి మారుమూలగా ఓ వైపునకు విసిరేసినట్టు ఉంటుంది. కాబట్టి ఇక్కడ రవాణాకు అనుకూలంగా ఇరుగు పొరుగు గ్రామాలకు ప్రయాణించడానికి వీలుగా పెద్ద వంతెన నిర్మించాలి.

– బొడ్డు సుబ్బారావు (బాబి), పెనుమదం

సంక్రాంతి సందడి షురూ

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారి పాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి హాజరయ్యారు. భోగిమంటలు, గంగిరెద్దులు, స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సర్పంచ్ నాగముత్యమాంబ, తహసీల్దార్ రాజరాజేశ్వరి బహుమతులను అందజేశారు. అనంతరం తహసీల్దార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి బాబులు, హెచ్ఎం కోలపర్తి శ్రీనివాస్, తెలగంశెట్టి వాసు, హరి, గ్రామ కార్యదర్శి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో ముగ్గుల పోటీలు

నరసాపురం: పట్టణంలోని బీజీబీఎస్ మహిళా కళాశాలలో గురువారం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగిమంటలు, గంగిరెద్దులు, హరిదాసులకోలాటం వంటి కార్యక్రమాలతో అలరించారు. ముఖ్యంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు వేడుకగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొన్నారు. అందమైన ముగ్గులు వేసి అలరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ నరసాపురం అధ్యక్షుడు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, కార్యదర్శి కంచర్ల బాబ్జి, కోశాధికారి కోట్ల బాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ముధుశాలిని తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గురువారం కళాశాల ఆవరణలో విద్యార్థులు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలు ఉత్తమ ముగ్గులను ఎంపిక చేశారు. శుక్రవారం కళాశాలలో జరగనున్న సంక్రాంతి సంబరాల్లో విజేతలను ఎంపిక చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.శోభారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల వాణిశ్రీ, అడబాల శ్వేత, ఎం.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో

మహిళలకు ముగ్గులు పెట్టడం అంటే చాలా ఇష్టమని అటువంటి మహిళ ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించామని విశ్వహిందూ పరిషత్ సభ్యురాలు టి.సునీత తెలిపారు. గురువారం స్థానిక సుబ్బారాయుడు గుడి సెంటర్ వద్ద శ్రీ వల్లీదేవసేన సహిత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గంధం నాగసాయి, మోటుపల్లి వరలక్ష్మి, మాజేటి భవానీలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గుణ్ణం దుర్గ, గుణ్ణం సుధ వాగ్దేవి, దేవరపు రామలక్ష్మి, గంధం బంగారు మణి పాల్గొన్నారు.


నరసాపురం: ముగ్గులు వేస్తున్న యువతులు


పాలకొల్లు సెంట్రల్: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు


నరసాపురం రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలి

నరసాపురం: పట్టణంలోని రాయిపేట ప్రాంతంలో ఇటీవల కాలంలో వరుస దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయని రాయిపేట వెల్ఫేర్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు అసోసిషన్ ప్రతినిధులు గురువారం నరసాపురం డీఎస్పీ డాక్టర్ డి.శ్రీవేద, నరసాపురం ఆర్డీఓ దాసి రాజులను కలిసి దొంగతనాలను అరికట్టాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అందే రంగారావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాయిపేటలో వరస దొంగతనాలు జరుగుతున్నాయని చెప్పారు. దొంగతనాలు జరిగిన వివరాలను తేదీలతో సహా వినతిపత్రంలో పేర్కొమని వివరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం కేసులు కూడా నమోదు చేయడం లేదని వాపోయారు. గతంలో ఇలాంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదన్నారు. రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేసి ఇకపై దొంగతనాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మీసాల సత్యనారాయణ, కావలి నాని, తమ్మిశెట్టి బాబ్జి పాల్గొన్నారు.


ఆర్డీఓ దాసి రాజుకు వినతిపత్రం ఇస్తున్న రాయిపేట వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

15 లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

పోడూరు: దాళ్వా పంటకు సంబంధించి ఈ నెల 15వ తేదీలోగా మండలంలోని రైతులంతా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం (బీమా) చెల్లించాలని మండల వ్యవసాయాధికారి జి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన కవిటం గ్రామంలో పర్యటించి దాళ్వా వరినాట్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన సంబంధించి రైతులు ఎకరానికి రూ.615 ప్రీమియం చెల్లించాలని సూచించారు. రైతులు తమ దగ్గరలో ఉన్న కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) సెంటర్లో గాని, సొసైటీలో గాని పోస్టాఫీసులో గాని పంట లోన్లు తీసుకుంటున్న బ్యాంకులో గాని బీమా ప్రీమియం చెల్లించవచ్చని తెలిపారు. అలాగే రైతులు సాధ్యమైనంత త్వరగా దాళ్వా వరినాట్లు పూర్తి చేయాలని, దగ్గర్లోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించి ఈ-పంట నమోదు పూర్తి చేసుకోవాలన్నారు. మండలంలోని అన్ని సొసైటీల వద్ద, డీలర్ల వద్ద రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 750 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారి సత్యనారాయణ తెలిపారు.


పోడూరు: కవిటంలో వరినాట్లు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ

బీమా చేయించుకోవాలి

నరసాపురం రూరల్: ప్రతి రైతు పంటకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా చేయించుకుని ధీమాగా ఉండాలని నరసాపురం వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల కుమారి అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుల చేశారు. ఈ నెల 15లోపు బీమా ప్రీమిం చెల్లించాలని స్పష్టం చేశారు.

గాంధేయంపై కవితా రచన పోటీలు

భీమవరం: మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 30వ తేదీన సర్వోదయ మండలి ఆధ్వర్యంలో సీనియర్ రచయితలకు గాంధేయంపై కవితా రచన పోటీలు నిర్వహించనున్నట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధేయం మార్గదర్శకం అనే అంశంపై ఒక పేజీకి మించకుండా రచనలు పంపించాలన్నారు. 25 ఏళ్ల దాటిన రచయితలు మాత్రమే అర్హులన్నారు. రచనలను ఈనెల 22లోపుగా జిల్లా సర్వోదయ మండలి, గాంధీ కస్తూరిబా భవనం, శ్రీరాంపురం, భీమవరం-2 అనే చిరునామాకు పోస్టు ద్వారా పంపించాలన్నారు. విజేతలకు 30న బహుమతులు అందజేస్తామని తెలిపారు.

మావుళ్లమ్మ ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

భీమవరం (ప్రకాశం చౌక్): ఈనెల 13 నుంచి నిర్వహించనున్న భీమవరం శ్రీమావుళ్లమ్మ మహోత్సవాలకు విచ్చేయాల్సిందిగా కలెక్టర్ చదలవాడ నాగరాణిని ఉత్సవ కమిటీ కోరింది. ఈమేరకు కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ నెలరోజులపాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యవర్గ అధ్యక్షుడు రామాయణం గోవిందరావు, ఉపాధ్యక్షుడు కొప్పుల సత్యనారాయణ (సత్తిబాబు) తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

మొగల్తూరు: మండలంలోని పలు ఆలయాల్లో ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసి, విద్యుత్ దీపాలంకరణ, క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కొత్తోట, పేరుపాలెం, స్థానిక రామాలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

యలమంచిలిలో..

యలమంచిలి: ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆంజేయస్వామి ఆలయాలకు రంగులు వేసి, ఆలయం ఎదుట కొబ్బరాకులతో పందిళ్లు వేసి విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మేడపాడు, నేరేడుమిల్లి, అడవిపాలెం గ్రామాల్లో ముక్కోటి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఆలయాల వద్ద ఏకాహ భజనలకు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నసమారాధనలకు ఏర్పాటు చేశారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా పట్టణంలో అన్ని ఆలయాలు విద్యుద్దీపాలంకరణ, పూల అలంకరణలతో తీర్చిదిద్దారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి కావడంతో ఆలయాల రద్దీకి అనుగుణంగా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేకువజామున 5 గంటలకు ఉత్తరద్వార దర్శనం చేయనున్నట్లు అర్చకులు తెలిపారు. స్థానిక బుధవారపు వీధి రామాలయం, శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి (చినగోపురం), క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం, కెనాల్ రోడ్డు దాసోహాంజనేయస్వామి, యడ్లబజారు సెంటర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు చేశారు.


పాలకొల్లు సెంట్రల్: ప్రత్యేకాలంకరణలో జనార్దన స్వామి


యలమంచిలి: మేడపాడులో ముక్కోటి ఉత్సవాలకు ముస్తాబైన ఆంజనేయస్వామి ఆలయం

కాపు విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: కాపు, తెలగ, బలిజ సామాజికవర్గాలకు చెందిన పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందిస్తున్నట్లు కాపు సంఘం కన్వీనర్ వంగా నరసింహరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 9న పట్టణ లయన్స్ కమ్యూనిటీ హాలులో మధ్యాహ్నం 3 గంటలకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. జనవరి 25లోపు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాలకొల్లు నియోజకవర్గానికి సంబంధించిన ఇంటర్, పాలిటెక్నిక్ సెకండ్ ఇయర్, డిగ్రీ, బీటెక్, పీజీ, మెడిసిన్ చదువుతున్న విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌లకు అర్హులని తెలిపారు. గత వార్షిక పరీక్షల్లో 75 శాతం పైబడి మార్కులు సాధించడంతో పాటు ఇంజినీరింగ్ విద్యార్థులతై ఎంసెట్‌లో 30 వేల లోపు ర్యాంకు ఉండాలన్నారు. పూర్తి వివరాల కోసం 99122 43612, 94943 37711, 99635 93383 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


ఇలపకుర్రులో స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

యలమంచిలి: ఎస్టీయూ రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌లోని ప్రశ్నలను చదవి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షులు రుద్రరాజు బాల విజయవర్మ కోరారు. మండలంలోని 11 హైస్కూల్స్‌లో పదవ తరగతి చదువుతున్న 600 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీనుగురువారం ఆయన ప్రారంభించారు. ఈ స్టడీ మెటీరియల్‌ను బాలాజీవర్మ ప్రోత్సాహంతో హైదరాబాద్‌కు చెందిన కె అన్నయి, కె.సుమేధ ధన సహాయం చేయడంతో ఉచితంగా అందించామని తెలిపారు. గురువారం ఇలపకుర్రు, మట్లపాలెం హైస్కూల్ విద్యార్థులకు అందజేశారు. మిగిలిన హైస్కూల్స్‌లో త్వరలో అందిస్తామని స్పష్టం చేశారు.

పెనుగొండలో..

పెనుగొండ: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆచంట జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. గురువారం కొడమంచిలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరీయల్ అందించారు. నూరు శాతం ఫలితాల కోసం నూరు రోజుల ప్రణాళికను విద్యాశాఖాధికారులు అమలు చేస్తున్నారన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నరసాపురం: పట్టణంలో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం కమిషనర్ పలు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. డ్రెయినేజీలను శుభ్రం చేసే పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ డ్రెయినేజీలను బాగు చేయాలని చెప్పారు. సంక్రాంతి పురస్కరించుకుని దూర ప్రాంతాల నుంచి సొంతూరుకు వచ్చే వారికి పట్టణ పరిసరాలు ఆహ్లాదంగా కనిపించాలని చెప్పారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుడదని సూచించారు. మున్సిపల్ సిబ్బందికి ప్రతి రోజూ చెత్తను అందించాలని చెప్పారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు.

నేటి నుంచి వైఎన్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు

నరసాపురం: నరసాపురం వైఎన్ కళాశాల స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించడానికి కళాశాల పాలకవర్గం ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు వేడుకను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలుకు పూర్వ విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెనుగొండ: నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం పెనుగొండ పరిధిలో పలు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.మధుకుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పెనుగొండ, తామరాడ, రామన్నపాలెం, దొంగరావిపాలెం, సిద్ధాంతం గ్రామాల్లో సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే 11 కేవీ ఆచంట, పెదమల్లం, ఆచంట వేమవరం ఫీడర్స్ కొత్త విద్యుత్ లైను వేయడంతో పాటు నిర్వహణ పనులతో శుక్రవారం ఆచంట మండలంలోని ఆచంట, ఆచంట వేమవరం, కొడమంచిలి, కోడేరు, పెదమల్లం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకూ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల అందజేత

పోడూరు: విద్యార్థులు పట్టుదలతో చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని పండితవిల్లూరు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఎం.ఏసుబాబు అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద పండితవిల్లూరు జెడ్పీ హైస్కూల్లో గతఏడాది నిర్వహించిన వార్షిక పరీక్షల్లో 6, 7 తరగతుల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన కేతా దేవి, మీసాల హర్షిత ఎస్‌బీఐ పండితవిల్లూరు శాఖ ద్వారా సైకిళ్లను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం వీరవల్లి సత్య ప్రియరామ్, గణపతినీడి రాంబాబు, నామాల ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.